www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 104 | హైదరాబాద్ | బుధవారం | 02-07-2025 | పేజీలు: 04 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బనకచర్లకు అంకురార్పణ



**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:**
పోలవరంబనకచర్లపై కేంద్రానికి మన అభ్యంతరాలను తెలిపామని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు గోదావరి వాటర్ ట్రైబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమని వాదించామన్నారు. ఏపీ ప్రభుత్వం చేసిన బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనను కేంద్రం వెనక్కి పంపిన నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

“పోలవరం, ధవళేశ్వరానికి కలిపి ఏపీ 484 టీఎంసీలకు మించి వాడుకోరాదు. పోలవరం నుంచి నీటి ఎత్తిపోతల కోసం 2 టన్నెల్ నిర్మాణాలు ప్రతిపాదించారు. రోజుకు 20వేల క్యూసెక్కులు తరలించేలా 2 టన్నెల్స్ ప్రతిపాదన పెట్టారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బనకచర్ల ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. కృష్ణా గోదావరి జలాల్లో గత పదేళ్లలో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. గోదావరి జలాలను సీమకు తరలిస్తుంటే కేసీఆర్ నోరెత్తలేదు”అని మంత్రి ఉత్తమ్ అన్నారు.

## పార్టీ అంతర్గత అంశాలపై స్పందించిన కిషన్ రెడ్డి

- పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు
- రెండు పార్టీలు అవినీతి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకున్నాయని ఆరోపణ
- మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని భారాస అప్పుల్లోకి నెట్టిందని విమర్శ
- ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఫైర్


2

# కేసీఆర్ సంతకాలే మరణ శాసనం..

తెలంగాణ జలాల విషయంలో వెనక్కి తగ్గేది లేదు: రేవంత్ రెడ్డి

ప్రజాభవన్‌లో ‘గోదావరిబనకచర్ల’పై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్

తెలంగాణ జలాల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్

గత పదేళ్లలో కేసీఆర్, హరీశ్ రావులే రాష్ట్రానికి నష్టం చేశారని ఆరోపణ

2015 నాటి ఒప్పందమే తెలంగాణకు మరణశాసనంగా మారిందని తీవ్ర విమర్శ

రాష్ట్ర నీటి హక్కుల కోసం రాజకీయంగా, న్యాయపరంగా పోరాడతామని వెల్లడి

ఏపీ ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటుంటే తెలంగాణ ప్రాజెక్టులు పట్టించుకోలేదని వ్యాఖ్య





**హైదరాబాద్ జూలై 01(సిద్దిపేట పవర్):**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు 2015లో చేసిన సంతకాలే తెలంగాణ నీటి హక్కులకు మరణశాసనంగా మారాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర జలాల విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తే లేదని, తెలంగాణ హక్కుల సాధన కోసం రాజకీయంగా, సాంకేతికంగా, న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్‌లో ‘గోదావరిబనకచర్ల’ అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "పదేళ్ల పాటు నీటిపారుదల శాఖను కేసీఆర్, హరీశ్ రావులే చూశారు. వారే రాష్ట్ర నీటి హక్కులను కాపాడతారని ప్రజలంతా భావించారు. కానీ దురదృష్టవశాత్తు వారి నిర్ణయాల వల్లే తెలంగాణకు

...మిగతా 3లో

## ఈ సారి కూడా పంట బీమా లేనట్లేనా?

నాలుగు సీజన్లుగా అదే నిర్లక్ష్యం

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ యూరియా కొరతపై లేదా?

రైతులపై, వ్యవసాయంపై కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధి ఇదేనా?

మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం


2

## బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేయలేని పని తెలంగాణలో చేస్తున్నాం

- దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్రం తెలంగాణనే అన్న మంత్రి పొంగులేటి
- వరంగల్లు జిల్లాలో పర్యటించిన మంత్రి పొంగులేటి
- రాయపర్తి బహిరంగ సభలో బీఆర్ఎస్‌పై విమర్శలు


2

## తెరుచుకున్న బాబ్లీ గేట్లు.. రైతులు, మత్స్యకారుల హర్షం

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెరుచుకున్న బాబ్లీ గేట్లు

గోదావరి నదిలోకి నీటి ప్రవాహాన్ని ప్రారంభించిన అధికారులు

మొత్తం 14 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల అక్టోబర్ 28 వరకు తెరిచే ఉండనున్న ప్రాజెక్టు గేట్లు


2

## తెలంగాణలో ఏసీబీ దూకుడు.. ఆరు నెలల్లో 126 కేసులు

తెలంగాణలో దూకుడు పెంచిన ఏసీబీ..

6 నెలల్లోనే 126 కేసులు నమోదు..

125 మంది ప్రభుత్వ ఉద్యోగులు అరెస్ట్..



2

## ఆ రోజు ఏం జరిగిందంటే?

ఆపరేషన్ సిందూర్‌ట్రంప్ జోక్యంపై జైశంకర్ వివరణ

భారత్‌పాక్ యుద్ధం ఆపానన్న ట్రంప్ వాదనలో నిజం లేదన్న జైశంకర్

అమెరికా మాజీ అధ్యక్షుడి ప్రచారాన్ని తోసిపుచ్చిన జైశంకర్

మే 9న పాక్ దాడి, భారత్ దీటైన జవాబు ఇచ్చిందన్న మంత్రి

పాకిస్థానే నేరుగా కాల్పుల విరమణకు ముందుకొచ్చిందని వెల్లడి

పహల్గామ్ దాడిని ఆర్థిక యుద్ధంగా అభివర్ణన

ఉగ్రవాద నిర్మూలనలో అణు బెదిరింపులకు లొంగబోమని స్పష్టీకరణ


2

## రేవంత్‌ను ఎందుకు కాపాడుతున్నరు?

ఆర్ఆర్‌ట్యాక్స్, అమృత్ కాంట్రాక్ట్‌పై విచారణేది?

కంచ భూముల మోసంపై స్పందించరెందుకు?

నేషనల్ హెరాల్డ్ చార్జిషీట్‌లో పేరున్నా రక్షిస్తున్నరెందుకు?

అమిత్‌షాకు కేటీఆర్ ప్రశ్నలు



**హైదరాబాద్ జూలై 01(సిద్దిపేట పవర్):**
అవినీతి, అక్రమాలు, స్కాంలతో తెలంగాణ సమాజానికి అత్యంత ప్రమాదకరంగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేంద్రంలోని బీజేపీ సర్కారు కాపాడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలను సోమవారం ఎక్స్ వేదికగా ఎండగట్టారు. తాము అడిగే ప్రశ్నలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బదులివ్వాలని డిమాండ్ చేశారు. ‘తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీ పార్టీకి ఏటీఎంలా మారితే ఎన్డీఏ సర్కారు ఎందుకు రక్షిస్తున్నది? బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని స్వయంగా ప్రధాని చేసిన ఆరోపణలపై చర్యలెందుకు తీసుకోవడంలేదు? రేవంత్ బావమరిది సృజన్‌రెడ్డికి నిబంధనలకు విరుద్ధంగా రూ.1137 కోట్ల విలువైన అమృత్ కాంట్రాక్ట్ అప్పగింతపై ఫిర్యాదు చేసినా విచారణకు

...మిగతా 3లో

## నేను పేరుకే అధ్యక్షుడి-ని..

- ఎంతో మంది కార్యకర్తల త్యాగాల ఫలితంగానే బీజేపీ ఈ స్థాయికి చేరుకుంది..
- అందరి ఆశీస్సులతో నేను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికవడం గర్వంగా ఉంది..
- నేను పేరుకే అధ్యక్షుడిని.. నేనెప్పటికీ కార్యకర్తను.. మీ సేవకుడినే: రామచందర్ రావు


2

# కేసీఆర్ సంతకాలే మరణ శాసనం..

**మొదటిపేజీ తరువాయి**

తీరని నష్టం జరిగింది" అని ఆయన అన్నారు.

కృష్ణా జలాల్లో మొత్తం 811 టీఎంసీలకు గాను తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు చాలని, మిగిలిన 68 శాతం నీటిని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని 2015లో వారే సంతకాలు చేశారని రేవంత్ ఆరోపించారు.

కృష్ణా నది పరివాహక ప్రాంతం ప్రకారం చూస్తే వాస్తవానికి తెలంగాణకే ఎక్కువ నీటి వాటా దక్కాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ప్రాజెక్టులను గత పదేళ్లలో పట్టించుకోకపోవడం వల్లే రాష్ట్రానికి కేటాయించిన 299 టీఎంసీల నీటిని కూడా పూర్తిగా వాడుకోలేని దయనీయ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం తమ ప్రాజెక్టులను పూర్తిచేసుకొని నీటిని తరలించుకుపోతోందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని, నీటి హక్కుల పరిరక్షణలో వెనకడుగు వేసేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

# పార్టీ అంతర్గత అంశాలపై స్పందించిన కిషన్ రెడ్డి

- **పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు**
- **బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు**
- **రెండు పార్టీలు అవినీతి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకున్నాయని ఆరోపణ**
- **మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని భారాస అప్పుల్లోకి నెట్టిందని విమర్శ**
- **ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఫైర్**



**హైదరాబాద్ జూలై 01(సిద్ధిపేట పవర్):** కొత్త అధ్యక్షుడి ఎన్నిక విషయంలో పార్టీ అంతర్గత అంశాలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. బీజేపీలో పదవులు ముఖ్యం కాదని ఆయన అన్నారు. "రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరున్నా ఫర్వాలేదు. మన పార్టీకి కార్యకర్తలే నిజమైన నాయకులు, వాళ్లే మన బలం. నాయకత్వంలో ఎవరున్నా అందరూ ఐక్యంగా పనిచేయాలి" అని స్పష్టం చేశారు.


రామచందర్‌రావు నాయకత్వంలో నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అందరూ సమష్టిగా పని చేసి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

మంగళవారం హైదరాబాద్ శివార్లలోని మన్నెగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుటుంబ పాలన, అవినీతితో రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకున్నాయని ఆరోపించారు.

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఏమీ చేయడం లేదని కొందరు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఈ నిజాన్ని విమర్శకులు గుర్తించాలని ఆయన హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయం తామేనని, రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేయలేని పని తెలంగాణలో చేస్తున్నాం

- **దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్రం తెలంగాణనే అన్న మంత్రి పొంగులేటి**
- **వరంగల్లు జిల్లాలో పర్యటించిన మంత్రి పొంగులేటి**
- **రాయపర్తి బహిరంగ సభలో బీఆర్ఎస్‌పై విమర్శలు**



**హైదరాబాద్ జూలై 01(సిద్ధిపేట పవర్ ):** దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా పేదలకు సన్న బియ్యం ఇవ్వడం లేదని, కానీ తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి నిన్న వరంగల్లు జిల్లాలో పర్యటించారు.

ఈ సందర్భంగా రాయపర్తి మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ఆయన బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు పెద్ద పీట వేశారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా పేద వర్గాలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు.

గత ప్రభుత్వం ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చిందని, కానీ తమ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల మేలు కోసం భూభారతి చట్టం తీసుకువచ్చామని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని చెప్పారు. పార్టీ గెలుపుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తుందని తెలిపారు.

# తెరుచుకున్న బాబ్లీ గేట్లు.. రైతులు, మత్స్యకారుల హర్షం

- **సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెరుచుకున్న బాబ్లీ గేట్లు**
- **గోదావరి నదిలోకి నీటి ప్రవాహాన్ని ప్రారంభించిన అధికారులు**
- **మొత్తం 14 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల**
- **అక్టోబర్ 28 వరకు తెరిచే ఉండనున్న ప్రాజెక్టు గేట్లు**

**హైదరాబాద్ జూలై 01(సిద్ధిపేట పవర్):** మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య కీలకమైన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మంగళవారం అధికారులు ఎత్తారు. సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను అనుసరించి, ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా జులై 1న గేట్లను తెరిచారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ సమీపంలో గోదావరి నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టుకు ఉన్న 14 గేట్లను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అధికారుల పర్యవేక్షణలో ఇరు రాష్ట్రాల ఇంజనీర్లు పైకి లేపారు. దీంతో గోదావరి నదిలోకి నీటి ప్రవాహం మొదలైంది.

సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం ఏటా జులై 1 నుంచి అక్టోబర్ 28 వరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను పూర్తిగా తెరిచి ఉంచాల్సి ఉంటుంది. ఈ కాలంలో ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయకుండా, గోదావరి నది సహజ ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలి. ఈ నిబంధనను అనుసరిస్తూ మంగళవారం ఉదయం అధికారులు గేట్లను ఎత్తారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 1,064 అడుగుల వద్ద ఉందని అధికారులు వెల్లడించారు.

బాబ్లీ గేట్లు తెరుచుకోవడంతో దిగువన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులతో పాటు గోదావరి నదిపై ఆధారపడి జీవించే మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరు నేరుగా దిగువకు చేరనుండటంతో తమకు ప్రయోజనం కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో అధికారులు గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. బాబ్లీ నుంచి నీటి విడుదల ప్రారంభమైనందున నదిలో నీటి ప్రవాహం క్రమంగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల నది తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు, పశువుల కాపరులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఆ రోజు ఏం జరిగిందంటే?

- **ఆపరేషన్ సిందూర్-ట్రంప్ జోక్యంపై జైశంకర్ వివరణ**
- **భారత్-పాక్ యుద్ధం ఆపానన్న ట్రంప్ వాదనలో నిజం లేదన్న జైశంకర్**
- **అమెరికా మాజీ అధ్యక్షుడి ప్రచారాన్ని తోసిపుచ్చిన జైశంకర్**
- **మే 9న పాక్ దాడి, భారత్ దీటైన జవాబు ఇచ్చిందన్న మంత్రి**
- **పాకిస్థానే నేరుగా కాల్పుల విరమణకు ముందుకొచ్చిందని వెల్లడి**
- **పహల్గామ్ దాడిని ఆర్థిక యుద్ధంగా అభివర్ణన**
- **ఉగ్రవాద నిర్మూలనలో అణు బెదిరింపులకు లొంగబోమని స్పష్టీకరణ**



**హైదరాబాద్ జూలై 01(సిద్ధిపేట పవర్):** భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఆ ప్రచారాన్ని ఆయన పూర్తిగా ఖండించారు. కాల్పుల విరమణ ఒప్పందం వెనుక జరిగిన అసలు వాస్తవాలను ఆయన ఒక అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే 'న్యూస్‌వీక్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జైశంకర్ మాట్లాడుతూ, మే 9వ తేదీ రాత్రి జరిగిన పరిణామాలను గుర్తుచేసుకున్నారు. "ఆ రోజు రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేశారు. ఆ సమయంలో నేను ప్రధానితో పాటే ఉన్నాను. పాకిస్థాన్ నుంచి భారత్‌పై పెద్ద ఎత్తున దాడి జరిగే ప్రమాదం ఉందని వాన్స్ హెచ్చరించారు. ఒకవేళ పాక్ దుస్సాహసానికి పాల్పడితే అందుకు తగిన రీతిలో, దీటుగా బదులిస్తామని మోదీ ఆయనకు స్పష్టం చేశారు" అని జైశంకర్ తెలిపారు.

ఆ తర్వాత జరిగిన ఘటనలను వివరిస్తూ "అనుకున్నట్టే ఆ రాత్రి పాకిస్థాన్ భారత్‌పై భారీ దాడికి తెగబడింది. అయితే, భారత బలగాలు ఆ దాడులను అత్యంత సమర్థవంతంగా, వేగంగా తిప్పికొట్టాయి" అని జైశంకర్ పేర్కొన్నారు. కాల్పుల విరమణకు దారితీసిన పరిస్థితులను ఆయన విడమరిచి చెప్పారు.

ఆ మరుసటి రోజు ఉదయం అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తనకు ఫోన్ చేసి, పాకిస్థాన్ చర్చలకు సిద్ధంగా ఉందని చెప్పినట్లు జైశంకర్ వెల్లడించారు. అయితే, ఆ తర్వాత కీలక పరిణామం చోటుచేసుకుందని ఆయన అన్నారు. "అదే రోజు మధ్యాహ్నం, పాకిస్థాన్ మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) మేజర్ జనరల్ ఖసిఫ్ అబ్దుల్లా, భారత డీజీఎంవో రాజీవ్ ఘాయ్‌కు నేరుగా ఫోన్ చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం పాటిద్దామని ప్రతిపాదించారు. అసలు జరిగింది ఇది" అని జైశంకర్ తేల్చిచెప్పారు. వాణిజ్యానికి, కాల్పుల విరమణకు భారత్ పరంగా ఎలాంటి సంబంధం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు.

**పహల్గామ్ దాడి ఆర్థిక యుద్ధమే**

ఇదే ఇంటర్వ్యూలో జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని జైశంకర్ ఒక 'ఆర్థిక యుద్ధ చర్య'గా అభివర్ణించారు. కశ్మీర్ లోయలో అభివృద్ధిని, శాంతిని ఓర్వలేకే ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడ్డారని ఆయన అన్నారు. "జమ్ముకశ్మీర్‌లో పర్యాటక రంగాన్ని దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే ఈ దాడి చేశారు. మత ఘర్షణలు రెచ్చగొట్టేందుకు, పర్యాటకుల మతం అడిగి మరీ వారిని కాల్చి చంపారు. ఈ ఘటన తర్వాత ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని మేం నిర్ణయించుకున్నాం" అని తెలిపారు. ఉగ్రవాదులకు, వారికి అండగా నిలిచే ప్రభుత్వాలకు భారత్ తగిన బుద్ధి చెబుతుందని, ఉగ్రవాదాన్ని అణిచివేసే క్రమంలో ఎలాంటి అణ్వస్త్ర బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు.


# తెలంగాణలో ఏసీబీ దూకుడు.. ఆరు నెలల్లో 126 కేసులు

- **తెలంగాణలో దూకుడు పెంచిన ఏసీబీ..**
- **6 నెలల్లోనే 126 కేసులు నమోదు..**
- **125 మంది ప్రభుత్వ ఉద్యోగులు అరెస్ట్..**

**హైదరాబాద్ జూలై 01(సిద్ధిపేట పవర్ ):** తెలంగాణ రాష్ట్రంలో ఏసీబీ దూకుడు పెంచింది. అవినీతి అధికారులను కటకటాల పాలు చేసేందుకు ప్రయత్నిస్తుంది. అడ్డదారిలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో లంచాలు తీసుకుని ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వారే టార్గెట్ గా తనిఖీలు చేసిన అక్రమార్కులను అరెస్ట్ చేస్తున్నారు. తాజాగా, తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచింది. మారుమూల ప్రాంతాల నుంచి కంప్లైంట్ వస్తే.. అక్కడికి వెళ్లి లంచగొడ్డిలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని తగిన శిక్షలు విధిస్తున్నారు.

ఇక, జనవరి నుంచి జూన్ వరకు కేవలం 6 నెలల్లో 126 కేసులు నమోదు చేసింది ఏసీబీ. జూన్ నెలలో 31 కేసులు నమోదు కాగా, అందులో 15 ట్రాప్, 2 అక్రమాస్తుల కేసు, 3 క్రిమినల్ దుష్ప్రవర్తన, 4 రెగ్యులర్ కేసులు, 7 ఆకస్మిక తనిఖీల కేసులు ఉన్నాయి. ఏసీబీ కేసుల్లో అరెస్ట్ అయిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు 25 మంది ప్రభుత్వ ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ నిందితులు జ్యూడిషల్ రిమాండ్ కు తరలించారు. ఏసీబీ ట్రాప్ కేసులో 3.43 లక్షల రూపాయల డబ్బు సీజ్ చేయగా.. రెండు అక్రమ ఆస్తుల కేసులో 13.50 లక్షల ఆస్తులు, 5.22 లక్షల ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు.

అయితే, ఆర్టీఏ, సబ్ రిజిష్టర్ తనిఖీల్లో లెక్క చూపని రూ. 2.72 లక్షలు సీజ్ చేశారు ఏసీబీ అధికారులు. 6 నెలల్లో 80 ట్రాప్ కేసులు, 8 అక్రమాస్తుల కేసులు, 14 క్రిమినల్ దుష్ప్రవర్తన, 10 రెగ్యులర్ ఎంక్వైరీలు, 11 ఆకస్మిక తనిఖీలు ఉన్నాయి. ఇందులో 8 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సహా 125 మంది ప్రభుత్వ ఉద్యోగులను ట్రాప్ చేసి అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ ట్రాప్ కేసుల్లో 24.57 లక్షల మొత్తం స్వాధీనం చేసుకోగా.. డీఏ కేసులలో 27.66 లక్షల విలువైన ఆస్తులను వెలికి తీశారు.. ఆర్టీఏలో జరుగుతున్న అక్రమలపై ఏసీబీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.







# రేవంత్‌ను ఎందుకు కాపాడుతున్నరు?

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశించడం లేదెందుకు? కంచ గచ్చిబౌలి అటవీ భూమిలో ఆర్థిక మోసంపై దర్యాప్తు చేయాలని కేంద్ర సాధికార కమిటీ చేసిన సిఫార్సులను ఏం చేశారు? నేషనల్ హెరాల్డ్ కేసు చార్జిషీట్‌లో పేరున్న రేవంత్‌ను ఎందుకు కాపాడుతున్నరు?' అంటూ అమిత్‌షాకు ప్రశ్నాస్త్రాలను సంధించారు. తెలంగాణలోని కాంగ్రెస్‌ను ఏటీఎం సర్కారు అని గొంతు చించుకున్న అమిత్‌షా.. తానే హోమంత్రిననే విషయాన్ని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉన్నదన్న సోయిని మరిచి 'నయా గజిని'లా మారారని ఎద్దేవా చేశారు.

సీఎం రేవంత్ అవినీతి, అరాచకాలకు బీజేపీ అగ్రనేతలు వంతపాడుతున్నారని విమర్శించారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో ఇందుకు ఎన్నో ఉదంతాలు ఉన్నాయని వివరించారు. కంచ భూముల వ్యవహారంలో భారీ కుంభకోణం ఉన్నది.. సమగ్ర దర్యాప్తు చేయాలని సుప్రీంకోర్టు నియమించిన సాధికార కమిటీ చేసిన సిఫారసులను కూడా కేంద్రం బుట్టదాఖలు చేసిందని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కంపెనీకి రూ.4,400 కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్ట్ కట్టబెట్టడంలో అవినీతి బహిరంగంగా కనిపిస్తున్నా మోదీ సర్కారు చోద్యం చూ డటం విడ్డూరంగా ఉన్నదని, పొంగులేటి ఇంటిపై ఈడీ దాడులపై కేంద్రం ఇప్పటి వరకు ప్రకటన చేయకపోవడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసు చార్జిషీట్‌లో సోనియా, రాహుల్‌తో పాటు రేవంత్‌రెడ్డి పేరు ఉన్నా ఆయనను విచారించకపోవడం రెండు పార్టీల మధ్య అనుబంధాన్ని బట్టబయలు చేస్తున్నదని చెప్పారు. కర్ణాటక వాల్మీకి కుంభకోణంలో ఓ తెలంగాణ కాంగ్రెస్ నేత బ్యాంకు ఖాతాల్లోకి రూ.45 కోట్ల నగదు బదిలీ జరిగిందని ఆధారాలున్నా బీజేపీ ప్రభుత్వం మౌనం వహించడంలోని ఉద్దేశమేమిటని నిలదీశారు. బీజేపీ, కాంగ్రెస్ బూటకపు నాటకాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో కర్రుకాల్చి వాతలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.



**మలబార్ గోల్డ్ బీఆర్ఎస్ ఘనతే**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో మలబార్ గోల్డ్ కంపెనీ ప్రారంభానికి సిద్ధం కావడం ఆనందంగా ఉన్నదని కేటీఆర్ తెలిపారు. ఈ కంపెనీని రాష్టానికి తెచ్చిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదేనని స్పష్టంచేశారు. 2021 సెప్టెంబర్‌లో ఎంవోయూ కుదుర్చుకున్నామని, 2022 అక్టోబర్‌లో ఏర్పాటుకు అంకురార్పణ జరిగిందని గుర్తుచేశారు. ఈ కంపెనీ ఏర్పాటుతో 2 వేల మందికి పైగా యువతకు ఉపాధి దొరకడం గర్వకారణమని పేర్కొన్నారు.

**యూనిఫాంలకు డబ్బుల్లేవా?**

గురుకుల విద్యార్థుల యూనిఫాంలకు కాంగ్రెస్ సర్కారు డబ్బులివ్వకపోవడం సిగ్గుచేటని కేటీఆర్ మండిపడ్డారు. అందా ల పోటీలకు మాత్రం రూ. 200 కోట్లు దుబారా చేసిందని విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ సర్కారు ఘనకార్యాలు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ దృష్టికి వెళ్లకపోవడం దురదృష్టకరమని, తన ట్వీట్‌తోనైనా కండ్లు తెరిచి సీఎం రేవంత్‌కు సూచనలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఈ సారి కూడా పంట బీమా లేనట్లేనా?

- **నాలుగు సీజన్లుగా అదే నిర్లక్ష్యం**
- **అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ యూరియా కొరతపై లేదా?**
- **రైతులపై, వ్యవసాయంపై కాంగ్రెస్ కు ఉన్న చిత్త శుద్ధి ఇదేనా?**
- **మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం**



**హైదరాబాద్ జూలై 01(సిద్ధిపేట పవర్):** పంట బీమా అంటూ ఎన్నికల ప్రచారంలో ఊదర గొట్టిన రేవంత్ రెడ్డి నాలుగు సీజన్లుగా పంట బీమా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటలు కోటలు దాటితే, రేవంత్ ఆచరణ గడప కూడా దాటదు అనడానికి.. ఇప్పటికీ అమలు కాని పంటల బీమా మరో ఉదాహరణ అన్నారు. ఎన్నికలు వస్తే హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చాక 'మొండిచేయి' చూపడం హస్తం పార్టీకి అలవాటుగా మారిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, రోట్లో తలపెట్టిన చందంగా మారింది రైతుల పరిస్థితి అన్నారు. 'వివిధ కారణాలతో పంట నష్టపోతే తక్షణం నష్టపరిహారం అందేలా పటిష్టమైన పంట బీమా పథకం తెస్తాం' అని అభయ హస్తం మేనిఫెస్టో, వరంగల్ రైతు డిక్లరేషన్ లో హామీ ఇచ్చారన్నారు. 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కార్యక్రమం ఆధారంగా చేసుకొని రాష్ట్రంలో పంట బీమా పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తాం' అని ఇప్పటి వరకు ప్రవేశ పెట్టిన మూడు బడ్జెట్ ప్రసంగాల్లోనూ (ఓటాన్ అకౌంట్ తో సహా) చెప్పారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామికి, బడ్జెట్ లో చెప్పిన మాటకు విలువ లేకుండా పోయిందన్నారు. గత బడ్జెట్ లో రూ. 1300 కోట్లు కేటాయించి, కేవలం కాగితాలకే పరిమితం చేసారు తప్ప రూపాయి విదిల్చింది లేదన్నారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు పంటల బీమాకు అతీగతీ లేకపోవడం కాంగ్రెస్ మార్కు రైతు వ్యతిరేక విధానానికి నిదర్శనం అన్నారు. నిజంగా పంట బీమా అమలు చేయాలనే చిత్తశుద్ధి గనక ఉంటే, మే, జూన్ నెలల్లోనే టెండర్లు పిలవాల్సి ఉందన్నారు. కానీ ఆ ప్రక్రియ ఇప్పటికీ చేపట్టక కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నదన్నారు. అకాల వర్షాలు, వడగండ్లు, ఇతర విపత్తులు వచ్చిన ప్రతిసారి సాయం అందక రైతన్నలు మరింత చితికిపోతున్నారన్నారు. పంట బీమా అమలు చేయకపోవడం, రైతు భరోసా సరిగ్గా ఇవ్వకపోవడంతో రైతులు అప్పుల పాలై కోలుకోవడం లేదన్నారు. సర్వేల పేరుతో కాలయాపన తప్ప, నష్ట పరిహారం పూర్తి స్థాయిలో ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వ్యవసాయం, రైతాంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తున్నదన్నారు. రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టారు.. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా అటకెక్కించారు..రుణమాఫీ చారాణ చేసి బారాణ మందిని మోసం చేసారు.. అన్ని పంటలకు బోనస్ అని, సన్నాలకే పరిమితం చేశారు.. సన్నాలకు 1200 కోట్ల బోనస్ డబ్బులను ఇప్పటికీ చెల్లించక రైతులకు బాకీ పడ్డారన్నారు. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి, ఎన్నికల మేనిఫెస్టోలో, బడ్జెట్ ప్రసంగాల్లో పంట బీమా అమలు చేస్తామని చెప్పిన మాటను నిలుపుకోవాలని, యూరియా కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.


# నేను పేరుకే అధ్యక్షుడిని..

## నేనెప్పటికీ కార్యకర్తను.. మీ సేవకుడినే!

**హైదరాబాద్ జూలై 01(సిద్ధిపేట పవర్):**

ఎంతో మంది కార్యకర్తల త్యాగాల ఫలితంతోనే బీజేపీ ఈ స్థాయికి చేరుకుంది అని బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. నాకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వడం గర్వంగా భావిస్తున్నాను.. ప్రతి కార్యకర్త గర్వించాలి.. అందరం కలిసి కట్టుగా పని చేద్దాం అని పిలుపునిచ్చారు. నేను పేరుకే అధ్యక్షుడిని.. నేనెప్పటికీ కార్యకర్తనే.. మీ సేవకుడినే పేర్కొన్నారు. కార్యకర్తలే ఈ పార్టీకి నిజమైన సారథులు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జనసంఘ్ అభ్యర్థి పోటీ చేస్తే వెయ్యి ఓట్లు మాత్రమే వచ్చాయి.. కమ్యూనిస్టు పార్టీ గెలిచింది.. ఆనాడు జనసంఘ్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు టపాసులు కాల్చారు.. ఇదేందని కమ్యూనిస్టులు అడిగితే గత ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని సంబురాలు చేసుకుంటున్నామని చెప్పారు.. ఇవాళ అదే ఉత్సాహంతో తెలంగాణలో 8 ఎమ్మెల్యే, 8 ఎంపీ, 3 ఎమ్మెల్సీ సీట్లను కైవసం చేసుకున్నామని రామచందర్ రావు తెలిపారు.

అయితే, పార్టీ కోసం సైకిల్ పై రాష్ట్రమంతటా తిరుగుతూ ఎంతో కష్టపడ్డామని టీబీజేపీ చీఫ్ రామచందర్ రావు పేర్కొన్నారు. బీజేపీ ఈ స్థాయికి వచ్చిందంటే.. ఎంతో మంది కార్యకర్తలు, నాయకులు త్యాగాలున్నాయి.. మీ చెమట కష్టంతోనే బీజేపీ ఎదిగింది.. అందరి ఆశీస్సులతో నేను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికవడం గర్వంగా ఉంది.. ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. నక్సలైట్ల తూటాలకు బలైన బీజేపీ నాయకుల బలిదానాల వల్లే పార్టీ ఈ స్థాయికి ఎదిగింది.. బీజేపీ మాస్ క్యాడర్ పార్టీ, సిద్ధాంత బలమున్న పార్టీ.. కలిసికట్టుగా గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరేద్దామని తెలిపారు. బీజేపీలో కొత్త, పాత అనే పంచాయతీ లేదు.. నది ప్రవహించాలంటే కొత్త నీరు రావాల్సిందే అన్నారు. తెలంగాణ యువత రాజకీయాల్లోకి రావాల్సిందే అని రామచందర్ రావు వెల్లడించారు.



ఇక, యువకులారా.. మహిళలారా.. బీజేపీలోకి రండి అంటూ రామచందర్ రావు పిలుపునిచ్చారు. 33 శాతం రిజర్వేషన్ల ఆమలుతో మహిళలకు ఎన్నో అవకాశాలు రాబోతున్నాయి.. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు గెలుపే లక్ష్యంగా పని చేస్తాను.. బీఆర్ఎస్, కాంగ్రెస్ వాట్సాప్ యూనివర్శిటీలను పెట్టుకుని ఫేక్ న్యూస్ ను ట్రోలింగ్ చేస్తున్నారు.. స్వామి వివేకానంద చెప్పిన మాటలను గుర్తు తెచ్చుకుని పోరాడుదాం.. మీకు దమ్ముంటే.. నేరుగా ఎదురుగా పోరాడదాం.. నేను క్రిమినల్ లాయర్ ను.. ఫేక్ న్యూస్ సూత్రధారులను బోనులో నిలబెట్టేందుకూ వెనుకాడనని తేల్చి చెప్పారు. రామచంద్రరావు సౌమ్యుడినే.. యుద్ధంలోకి దిగితే యోధుడినే.. కత్తి దూయడంలో ముందుంటానని చెప్పుకొచ్చారు. ఇక, తెలంగాణ ప్రజల తరపున అలుపెరుగని పోరాటం చేస్తానని తెలంగాణ కమలం పార్టీ అధినేత తెలిపారు.




## రైతులు సేంద్రియ పద్దతుల్లో వ్యవసాయం చేయాలి

- హస్ సంస్థ ఆధ్వర్యంలో విత్తనాల పంపిణి
- హైదరాబాద్ అగ్ర మిత్ర సాంఘిక సేవ సంస్థ చైర్మన్ కానడతకుల ఫాదర్ ఆంటోని

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** హైదరాబాద్ అగ్ర మిత్ర సాంఘిక సేవ సంస్థ కడనతకూల ఫాదర్ ఆంటోనీ చైర్మన్ ఆయన ఆదేశాల మేరకు జగదేవపూర్ మండలంలోని అలిరాజ్ పేట గ్రామంలో 50 మంది రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీకే ఆస్ట్రియా మరియు ఇటాలియన్ బిష్‌వారు సహాయం చేయడం జరిగిందని తెలిపారు. రైతులు సేంద్రియ పద్ధతులతో వ్యవసాయం చేయడం జరుగుతుందని అన్నారు. ఇక్కడ ఉన్న రైతులు గత 4 సంవత్సరాల నుండి వివిధ సంస్థల నుండి విత్తనాలు పొందుతున్నారని హాస్ డైరెక్టర్ ఫాదర్ ఆంటోనీ 52 మంది రైతులకు విత్తనాలు పంపిణీ చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శాంతి రాచమల్ల కిష్టయ్య డి.కుమారస్వామి విష్ణు చారి సంతోష్‌నర్సింలు టి.రమేష్‌బాలకృష్ణ కర్ణాకర్ రెడ్డి ఆర్ యాదగిరి అంజయ్య రాజ్ రాజయ్య మల్లేష్ బాలస్వామి ఆర్.ఆంజనేయులు ఆర్. దుర్గయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు డ్రగ్స్ సైబర్ క్రైమ్స్ పై అవగాహన కల్పించిన మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి



**దుబ్బాక, సిద్దిపేట పవర్ న్యూస్ జులై 01: ప్రతినిధి** ఒక ఐడియా జీవితాన్ని మార్చేస్తుందని విద్యార్థులను ఉద్దేశించి విద్యార్థులు క్రమశిక్షణగా మెదగాలని మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని ప్రవేట్ ఫంక్షన్ హాల్లో అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాట్ నెక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విద్యార్థులు భారీ ఎత్తున తరలివచ్చారు.అనంతరం విద్యార్థులకు డ్రగ్స్ సైబర్ క్రైమ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అకాడమీ కళాశాల ప్రిన్సిపుల్ మధుకర్ స్వామి మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా సెల్ ఫోన్లు చూస్తున్నారని అన్నారు అవసరమున్నప్పుడే తప్ప ఫోన్ వాడాలి కానీ ఎప్పుడు ఫోన్ వాడకూడదని అన్నారు.అంతే కాకుండా గుట్కాలు పాన్ మసాలా లాంటి నీ అలవాటు చేసుకుని మీ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. కష్టపడి చదివి చిన్న స్థాయి నుండి పెద్ద స్థాయి కూడా వెళ్ళవచ్చు అని అన్నారు. అనావసరమైన వాటికి ఆకర్షితులై జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు.విద్యార్థులు కళా



శాలలకు వెళ్లేటప్పుడు తల్లిదండ్రులు అప్పుడప్పుడు వారి నడవడికను గమనించాలని అన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో అఖిల రాజ్ ఫౌండేషన్ అధినేత కూకట్పల్లి ఎస్ఐ తౌడ సత్యనారాయణ,ప్రముఖ వ్యాపార వేత్త చింత రాజు,నల్ల శ్రీనివాస్,అఖిల రాజ్ ఫౌండేషన్ సభ్యులు ఇనుప రవి, జోగు సాగర్,, మహేష్, అందె ప్రవీణ్, అందె శ్రీనివాస్, అస్కె స్వామి, అల్లిబిల్లి కుమార్,భారీ ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబీకులను పరామర్శించిన రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ .బక్కి వెంకటయ్య

**సిద్దిపేట పవర్ న్యూస్ జులై 1** ప్రతినిధి_భూంపల్లి గ్రామం. అక్బరు పేటభూంపల్లి మండలం. సిద్దిపేట జిల్లా. భూంపల్లి గ్రామం లో ఇటీవలే అనారోగ్యం తో బాధపడుతూ మృతిచెందిన కొత్త కూర్మ అంజవ్వ కుటుంబీకులను పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చిన రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ ..బక్కి వెంకటయ్య తొగుట మండలం కాన్గల్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బాసిరెడ్డి రాంభూపాల్ రెడ్డి తల్లి అనసూయమ్మ మరణించిన విషయం తెలిసి వారి కుటుంబీకులను పరామర్శించారు.అనంతరం పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతున్నీ ప్రార్థించారు. ఈ సందర్భం లో చైర్మన్ వెంకటయ్య గారితో పాటు మాజీ ఎంపిటిసి ఉల్లెంగల నవ్యనరేష్,దుబ్బాక పిఎసిఎస్ చైర్మన్ శేర్ల కైలాసం,మాజీ ఉప సర్పంచ్ పర్స స్వామి,కథల పర్శరాములు,వడ్ల ప్రభాకర్, ఉసికే కుమార్,సతీష్,నాగరాజు,యేసు,ప్రకాష్,ఇతరులు ఉన్నారు.




# ప్రాణాన్ని ప్రాణంగా పెట్టి రక్షించే దేవుళ్లు డాక్టర్లు

- చేర్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.శ్రీను
- చేర్యాల డాక్టర్ల ఆద్వర్యంలో భారీ ర్యాలీ
- యశోద హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత గుండె వైద్య శిబిరం
- వందలాది ప్రజలకు ఉచిత గుండె పరీక్షలు చేసిన వైద్యులు

**చేర్యాల, జూలై 1 (సిద్దిపేట పవర్)** తన ప్రాణాలను ప్రాణంగా పెట్టి రక్షించే దేవుళ్ళు డాక్టర్లు మాత్రమేనని చేర్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్. శీను అన్నారు. చేర్యాల పట్టణంలో సీడీఏ (చేర్యాల డాక్టర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో డాక్టర్స్ డే పురస్కరించుకొని మంగళవారం యశోద హాస్పిటల్ వారి సౌజన్యంతో అక్షర ఆసుపత్రిలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు చేర్యాల గాంధీ సెంటర్ నుండి విద్యార్థులు, పట్టణ ప్రజలు, నాయకులతో డాక్టర్లు హనుమాన్ టెంపుల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి డాక్టర్స్ అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేర్యాల సిఐ ఎల్. శ్రీను హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు డ్రగ్స్ కు బానిసై తమ విలువైన జీవితాలలో ఆగం చేసుకోవద్దని సూచించారు. ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ముందస్తు జాగ్రత్త పడుతూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచనలు చేస్తూ డాక్టర్లు తన వ్యాపారం నడవడం ముఖ్యం కాదని ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. ఆగిపోయే ఊపిరిని నిలిపే ప్రత్యక్ష దైవం,ఆపద సమయంలో కూడా నిస్వార్థంగా సేవలు అందిస్తూ తమ ప్రాణాలను సైతం ప్రాణంగా పెట్టి ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తూ సమాజ శ్రేయస్సు కోసమే బతుకే డాక్టర్ లందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల ఎస్సై పీ.నీరేష్,చేర్యాల ఎంఈఓ రచ్చ కిష్టయ్య, ప్రొహిబిషనరీ ఎస్ఐ సమత, యశోద హాస్పిటల్ కోర్డియాలజిస్టు డాక్టర్ శ్రీకాంత్, చేర్యాల డివిజన్



డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామగల్ల పరమేశ్వర్, ఉపాధ్యక్షులు ఏడెల్లి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి తుంగ రఘునందన్ రాణా, బాలకిషన్, సతీష్, సిద్దిపేట ఆర్థోపెటిక్ డాక్టర్ మేక శ్రీకాంత్, స్థానిక నాయకులు, పుర్మ ఆగంరెడ్డి, దాసరి కళావతి, అంకుగారి శ్రీధర్ రెడ్డి, అందె బీరయ్య, మేడిశెట్టి శ్రీధర్, అందె అశోక్, మేక మల్లేశం, పుర్మ వెంకట్ రెడ్డి, ముస్త్యాల నాగేశ్వర్ రావు, తడక లింగమూర్తి, పాల లక్ష్మీనారాయణ, దాసరి శ్రీకాంత్, బుట్టి సత్యనారాయణ, ఎండి జహురుద్దీన్, తాటికొండ సదానందం, చందా శ్రీకాంత్, ప్రైవేట్ పాఠశాల సంఘం అధ్యక్షులు తౌట రామాంజనేయులు, మల్లారెడ్డి, దేవేందర్ రెడ్డి, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## మొదలైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

**నంగునూరు మండలం జులై 01 (సిద్దిపేట పవర్)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మంగళవారం నంగునూర్ గ్రామంలో దేవులపల్లి తిరుమల ప్రవీణ్ ఇంటికి ముగ్గు పోసి ప్రారంభించిడం జరిగింది వారు మాట్లాడుతూ గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు సొంత స్థలాలు ఉన్న వారికి బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద ఇల్లు నిర్మించుకునేందుకు 3 లక్షలు ఇస్తామని ప్రకటిం చింది. కానీ లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరగడంతో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రాగా, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా లబ్ధిదారులు నిర్మించుకున్నారు. అదే తరహాలో ప్రభుత్వం ఇళ్ల పథకాన్ని తీసుకరావడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. ఇట్టి కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఎంపిడిఓ లక్ష్మప్ప గ్రామ కార్యదర్శి చంద్రకళ ఏఈ ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు



## అరులైన ప్రతి ఒక్కరికి విడుతల వారిగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

**ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువజన ఉపాధ్యక్షులు బురాని శ్రీకాంత్**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూలై ప్రతినిధి**


దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజిపేట వార్డులో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు. శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువజన ఉపాధ్యక్షులు బురాని శ్రీకాంత్ కరాటే మాస్టర్, స్థానిక నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి కొబరికాయ కోట్టి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రజా పాలన పనిచేస్తుందని ప్రతి నిరుపేద కుటుంబానికి గూడు కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం కొనసాగుతుందని అరులైన ప్రతి ఒక్కరికి విడుతల వారిగా ఇందిరమ్మ ఇల్లు మంజూరూ చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఈ జాహ్నవి,వార్డు ఆఫీసర్ రమేష్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,9వ వార్డు ఇంచార్జ్ గట్టు శ్రీకాంత్,ఎర్వ కుమార్,గట్టు కిరణ్,మాజీ కౌన్సిలర్ బత్తుల స్వామి,తదితరులు పాల్గొన్నారు.



## మెదక్ ఎంపీనీ పరామర్శించిన దుబ్బాక బిజెపి నాయకులు

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూలై ప్రతినిధి**


మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావుకు కుడికాలికి ఐదు రోజుల క్రితం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో ఆపరేషన్ జరిగింది. ఈ సందర్భంగా మెదక్ ఎంపీనీ దుబ్బాక బిజెపి నాయకులు కలిసి పరామర్శించి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో ఉండాలని వారు అభిలషించారు.పరామర్శించిన వారిలో బీజేపీ దుబ్బాక మున్సిపల్ జనరల్ సెక్రెటరీలు ఆకుల నరేష్, గట్టు ప్రసాద్, నాయకులు బి ప్రవీణ్ కుమార్ గౌడ్,లిఖిత్,ఫణిదర్,వెంకట్,మహేష్‌లు ఉన్నారు.



## మొహరం వేడుకలకు విద్యుత్ సామాగ్రి వితరణ

**అవసరమైన మేరకు కొనిచ్చిన చక్రధర్ గౌడ్**

**నంగునూరు,జూలై 1 (సిద్దిపేట పవర్)** నంగునూరు గ్రామంలో మొహరం వేడుకలకు అవసరమైన విద్యుత్ సామాగ్రి కొనుగోలుకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ గాదగోని చక్రధర్ గౌడ్ ఆర్థిక సహాయం చేశారు. మొహరం వేడుకలకు గాను అవసరమైన విద్యుదీకరణ (ఎల్ ఈ డీ విద్యుత్ దీపాలు, రంగుల విద్యుత్ దీపాలకు అవసరమైన విద్యుత్ సామాగ్రి) సామాగ్రి కావాలని మొహరం కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తికి స్పందించిన కాంగ్రెస్ నాయకుడు, ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ గాదగోని చక్రధర్ గౌడ్ వెంటనే నంగునూరు మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గోనెపల్లి శివప్రసాద్ గౌడ్ ద్వారా అవసరమైన సామాగ్రి అందించారు. మొహరం పండుగ ఘనంగా జరపాలని, ఏమైనా అవసరం అయితే ఫోన్ చేయాలని చక్రధర గౌడ్ వారికి సూచించారు. మొహ్రరం కమిటీ సభ్యులు చక్రధర్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అబ్దుల్, కోల యాదగిరి, మహేశ్ , అనరాజు, అప్పిస నర్సిములు, పల్లపు శేఖర్, యాట సాయిబాబు, అనరాజు మహేశ్, గౌరబోయిన భాస్కర్, కోల సాయిరాం, నర్సింహా రెడ్డి, మెతుకు రాజిరెడ్డి, అనరాజు తరుణ్, సోప్పరి సంజీవ్, పల్లపు భాను తదితరులు పాల్గొన్నారు



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

**సిద్దిపేట పవర్, సిద్దిపేట అర్బన్:** 38వ వార్డు ఇంచార్జ్ బైరి ప్రవీణ్ కుమార్ మంగళవారం స్థానిక సిద్దిపేట 38వ వార్డులో ఇందిరమ్మ ఇంటికి ఎంపికైన గాదగోని జయ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. జయకు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందించారు. నిర్మాణానికి తొలిమెట్టు అయిన ముగ్గు పోయడం జరిగింది. ఈ కార్యక్రమానికి లబ్ధిధారైన గాధగోని జయ, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ , 17 వార్డు ఇంచార్జీ, వెంకటేశ్వర గుడి డైరెక్టర్ బైరి నాగమణి, మార్క సతీష్ లను ఆహ్వానించగా వారి ఆధ్వర్యంలో లబ్ధిదారుకు శుభాకాంక్షలు తెలిపి కొబ్బరికాయ కొట్టి స్థానిక 38వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బైరి ప్రవీణ్ కుమార్ భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 38వ వార్డ్ మున్సిపల్ అధికారి, 2వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు 38వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసిన మీసం మహేందర్ యాదవ్

**సిద్దిపేట పవర్ చిన్నకోడూర్ జులై 1** చిన్నకోడూరు మండలంలోని అల్లీపూర్ గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ఆదేశాలమేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమం లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంకాళి యాదగిరి, ఇరుమాల్ల ముత్యం, దృగల భూమయ్య, నాయకులు పిల్లి బాబు, శానగొండ రాజు, కోడెల నాగరాజు. గ్రామస్తులు కామ రాజు,దేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

- జూలై 7 లోగా దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి కవిత

**సిద్దిపేట పవర్,సిద్దిపేట బ్యూరో :** హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టిఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్లో ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి కవిత , హాస్టల్ వెల్ఫేర్ అధికారులు చెప్పారు ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సిద్దిపేట ఎస్సీ స్టడీ సర్కిల్ లో కరపత్రాన్ని హాస్టల్ వెల్ఫేర్ అధికారుల సమక్షంలో ఆవిష్కరించి మాట్లాడారు.సివిల్స్ కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు జూలై 7 లోపు ఆన్లైన్ tsstudycircle. co.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జులై 13 న ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించి అందులో వచ్చిన మెరిట్ ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఎస్సీ లకు 75, ఎస్టీ లకు 10 , బీసీ లకు 15 శాతం సీట్లు , ఇందులో మహిళలకు 33 శాతం, పి డబ్లు డి వారికి 5 శాతం సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 3 లక్షలు మించరాదని పేర్కొన్నారు. ఎంపిక అయిన అభ్యర్థులకు 10 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా శ్రీకాంత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# మీడియా సంస్థలకు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- పోలీసులు వెంటనే అతన్ని అరెస్టు చేయాలి
- అధికారంలో ఉన్నాననే భ్రమలో జగదీశ్వర్ రెడ్డి ఉన్నారు
- జగదీశ్వర్ రెడ్డికి ప్రజలే తగిన శాస్తి చేస్తారు
- కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కొమ్ము విజయకుమార్

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి జూలై 01:**



మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపై నిన్న చేసింది దాడి కాదని నిరసన మాత్రమేనని, ఇంకా రెండు మూడు చానల్స్ ఉన్నాయని, వాటి సంగతి కూడా తేలుస్తామని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కొమ్ము విజయకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలకేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ మీడియా ముందు ఆదివారం మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడిన మాటలు సభ్యసమాజం తల దించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. తాను ఇంకా అధికారంలో ఉన్నానని భ్రమ పడుతున్నారని, రాష్ట్రంలో అధికారానికి దూరమైనా ఆయనకు అహంకారం తగ్గలేదని దుయ్యబట్టారు. ఉద్యమ సమయంలో బెదిరించినట్లు ఇప్పుడు మీడియాను బెదిరించడం, దాడులు చేస్తామని హెచ్చరించడం, కొన్ని మీడియా సంస్థలను ఆంధ్రా మీడియాగా చిత్రీకరించడం, బూతులతో రెచ్చిపోవడం చూస్తుంటే జగదీశ్వర్ రెడ్డికి నిజంగానే మతి భ్రమించినట్లుగా ఉందని అన్నారు. మంత్రిగా నౌఖరీ వెలగబెట్టిన జగదీశ్వర్ రెడ్డి సంస్కారం లేకుండా మాట్లాడటం విచిత్రంగా ఉందని, ఒక మీడియా సంస్థ మీద దాడిని సమర్థించుకోవడం, మరి కొన్ని మీడియా చానల్స్ మీద దాడులు చేస్తామని మీడియా ముందు చెప్పడం ఆయన దివాలా కోరుతనాన్ని రుజువు చేస్తుందని అన్నారు. వెంటనే జగదీశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను సీరియస్‌గా స్వీకరించి పోలీసులు కేసు నమోదు చేసి జగదీశ్వర్ రెడ్డిని అరెస్ట్ చేయాలని కోరారు. ఇలా రెచ్చకొట్టడంతో గొడవలు సృష్టించే ప్రయత్నాలు చేసి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను చెడగొట్టే ప్రయత్నాలు చేస్తున్న జగదీశ్వర్ రెడ్డిని అరెస్టు చేసి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. జగదీశ్వర్ రెడ్డి నోటి దూల తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని, తమ పార్టీ కరపత్రం నమస్తే తెలంగాణ, చానల్ టీన్యూస్ లో వస్తున్న వార్తలు బురద చల్లే కార్యక్రమాలు, ప్రజల మధ్య విషం చిమ్మడం, అసత్య వార్తలు వండి వార్చడం జగదీశ్వర్ రెడ్డికి కనిపించడం లేదా అని విజయ్ కుమార్ ప్రశ్నించారు. ప్రతి విషయంలో చంద్రబాబుకు రేవంత్ రెడ్డికి ముడి పెట్టి మాట్లాడుతూ విషం చిమ్మడం ఏమిటని నిలదీశారు. రేవంత్ రెడ్డి ఒక పార్టీకి ఎలా ముఖ్యమంత్రిగా ఉన్నారో అలానే చంద్రబాబు మరో పార్టీకి ముఖ్యమంత్రిగా ఉన్నారనేది జగదీశ్ రెడ్డి తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. రెండు పార్టీల సిద్ధాంతాలు వేరు, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కాబట్టి తెలుగు ప్రజల సంక్షేమం కోసం కొన్ని విషయాల్లో కలిసి పని చేయడం, సమస్యల కోసం చర్చలు చేయడం అవసరమని మంత్రిగా పనిచేసిన జగదీశ్ రెడ్డికి తెలియకపోవడం ఆయన అవివేకానికి నిదర్శనమని పేర్కొన్నారు. చంద్రబాబుని బూచిగా చూపించి విషం చిమ్మడం, చంద్రబాబుని తెలంగాణ ద్రోహిగా మాట్లాడటం, చంద్రబాబు మీద విషం చిమ్మి సెంటిమెంట్ వ్యభిచారం చేసి జనాన్ని గొర్రెలు చేసి 10 ఏళ్లు అధికారం వెలగబెట్టి లక్షల కోట్లు దోచుకొని రాష్ట్రాన్ని దివాళా తీయించిన చరిత్రను మర్చిపోయి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పుడు అధికారం పోయాక మతి భ్రమించి మాట్లాడటం ఏమిటని, ఆ మూడు చానల్స్ నిజాలు మాట్లాడటం తప్పాఅని, మీ భజన చేయకపోవడం తప్పాఅని, మీ భజన చేయక పోతే ఆంధ్రా చానల్స్ అవుతాయాఅని, మీ నాయకుడు ఆంధ్రావాడు కాదాఅని, మీడియాకు హద్దులు ప్రాం తీయవాదం ఏమిటని, మీ దోపిడి ఛానల్ లో వస్తున్న విషపు వార్తల సంగతి జనానికి తెలియదాఅని, మీరు చేస్తుంది సంసారం మిగిలిన వాళ్ళు చేస్తుంది వ్యభిచారమాఅని ఘాటుగా ప్రశ్నించారు. చంద్రబాబు మీద రేవంత్ రెడ్డిమీద మీ మీడియాలో వస్తున్న కథనాలపై ఆ పార్టీలు దాడులు చేయలేవా అని, నాలుగు అడుగులు లేని నీవు మాత్రమే మగాడివా అని, మీరు అధికారంలో ఉన్నప్పుడు మీ తాటాకు చప్పుళ్లకు భయపడని మీడియా ఇప్పుడు మీ ఉడత ఊపులకు భయ పడుతుందా అని నిలదీశారు. మంత్రిగా మీ దోపిడి మొత్తం త్వరలో బయట పడుతుందన్న ఫ్రస్టేషన్ లో నోటి దూల చూపిస్తున్నావని, తెలుగు ప్రజల మధ్య అగ్గిపెట్టే నీ పద్ధతి మార్చుకోక పోతే జనం నిన్ను బొంద పెడతారని, తెలంగాణ బిఆర్ఎస్ జాగీరు కాదని మీడియా సంస్థలకు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు అమాయకులు కారని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని పదేళ్లుగా తెలంగాణ సంపదను దోచుకున్నారని, మీ నిజ స్వరూపం తెలుసుకుని మిమ్మల్ని ఇంట్లో కూర్చోబెట్టారని మీరు చేసిన తప్పులకు మీరు ఎప్పుడు జైళ్లకు వెళతారో చూస్తున్నారని స్పష్టం చేశారు.

### పొన్నాల లో ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎంఎస్పీ జాతీయ కమిటీ సభ్యులు

# దళిత రత్న అవార్డు గ్రహీత సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ మంద కుమార్ మాదిగ

**సిద్దిపేట పవర్ సిద్ది-పేట అర్బన్ జూలై 1**



సిద్దిపేట అర్బన్ లోని పొన్నాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు కుమార్ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్పీ జాతీయ కమిటీ సభ్యులు దళిత రత్న అవార్డు గ్రహీత సిద్దిపేట జిల్లా ఇన్చార్జి మంద కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కొలిమి మల్లేశం మాదిగ, ఎంఎస్పి సిద్దిపేట జిల్లా సెక్రటరీ హాజరై ఎమ్మార్పీఎస్ గద్దె నిర్మాణానికి భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల పోరాట ఫలితం గానే వర్గీకరణ సాధించుకోవడం జరిగిందని ,మాదిగ జాతి కోసమే కాకుండా సమాజంలో ఉన్న అన్ని వర్గాల పేద ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసి ఫలితాలను సాధించిన ఘనత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అని ,ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దె లను నిర్మించి జులై 7 న జెండాను ఎత్తి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సబ్బండ వర్గాల భాగస్వామ్యం తో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, వట్ యాదగిరి, శ్రావణ్, పోచయ్య యాదగిరి రామచంద్రం రాజు మల్లేశం ప్రశాంత్ యాదగిరి రాములు కిషన్ బాబు ధర్మేందర్ యాదగిరి విజయ్ బాలరాజ్ పాల్గొన్నారు

# మునగనూరు లో తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నూతన భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

- ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం
- 9రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా విడుదల చేశాం..
- నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం
- రాష్ట్ర బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట పవర్ సిద్దిపేట బ్యూరో:**





ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని రాష్ట్ర బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు తుర్కయంజాల్ లో మున్సిపాలిటీ లోని మూగనూరు లో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు నూతన భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేసి మంత్రి మాట్లాడారు .ఆర్టీసీ లో ప్రజా రవాణా వ్యవస్థలో లైఫ్ లైన్ గా ఉండి రిటైర్డ్ అయిన వారికి కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నాం అని చెప్పారు దీనికి తుర్కయంజాల్ మున్సిపాలిటీ నుండి 5 లక్షలు కేటాయించారని అన్నారు జిల్లా కలెక్టర్ ద్వారా 10 లక్షలు మంజూరు చేయిస్తామని చెప్పారు ఎమ్మెల్యే రంగరెడ్డి గారు ఎస్డీఎఫ్ నుండి నిధులు కేటాయిస్తారని చెప్పారు జీహెచ్ ఎంసీ జోనల్ కమిషనర్ తో మాట్లాడను ఇక్కడ ఉన్న డ్రైనేజీ నాళా సమస్య పరిష్కారం చేస్తాం అని చెప్పారు ఇక్కడ రోడ్డు నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి అని చెప్పారు అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం అని చెప్పారు ఆరోగ్య శ్రీ 5 10 లక్షలకు పెంచుకున్నాం అని చెప్పారు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం అని చెప్పారు సన్న వడ్లు బోనస్ ఇస్తున్నాం అని చెప్పారు రైతులకు రైతు రుణమాఫీ పూర్తి చేశాం అని చెప్పారు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామనీ అన్నారు 9రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా విడుదల చేశాం.. దేశంలో ఎక్కడ లేని విధంగా పంట పెట్టుబడి సహాయం అందించాం అని చెప్పారు నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం అని చెప్పారు కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నాం..కొత్త యూనిట్లు మంజూరు చేస్తున్నాం. కార్మికుల సంక్షేమానికి మా ప్రభుత్వం వ్యతిరేకం కాదని మంత్రి స్పష్టం చేసారు ఆర్టీసీ ఉద్యోగులకు పెన్షన్ లేదు..గత 10 సంవత్సరాల్లో ఆర్టీసీ నిర్వీర్యం చేశారని విమర్శించారు మేము కొత్త బస్సులు ,కొత్త నియామకాలు ,కొత్త బస్సు డిపోలు ఇస్తున్నాం అని చెప్పారు ఆర్టీసీ లాభాల్లోకి తీసుకొస్తున్నాం అని చెప్పారు ప్రయాణికుల భద్రత , ఆర్టీసీ పరిరక్షణ ఈ మూడింటికి ప్రాధాన్యత ఇస్తున్నాం అని చెప్పారు పెదోడికి రవాణా సౌకర్యం ఆర్టీసీ..పెద్ద మొత్తంలో



ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేస్తున్నాంకొత్త రూట్లలో బస్సులు నడిపిస్తున్నాం అని చెప్పారు 191 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ లో ఉచితంగా ప్రయాణం చేశారు.. 6300 కోట్ల రూపాయలు విలువైన ఉచిత బస్సు ప్రయాణం చేశారని చెప్పారు నేను విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుండి ఆర్టీసీ తో మంచి సంబంధం ఉండేది.. మా గురువు చొక్కరవు ఆర్టీసీ మంత్రిగా ఉండేవారు.. ఇంకో గురువు సత్యనారాయణ ఆర్టీసీ చైర్మన్ గా కూడా చేశారురాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ స్పెషల్ సబ్ ప్లాన్ కింద కమ్యూనిటీ హాల్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి , రోడ్స్ అండ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి ,ఇతర ముఖ్య నేతలు ,ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల మాజీ ధర్మకర్త కిష్టయ్య సేవలు మరువలేనివి..

- కిష్టయ్య కుటుంబానికి అండగా నేనున్నా...
- రెండు లక్షల ఆర్థిక సాయం అందచేత...



**మెదక్ (సిద్దిపేట పవర్ ) ప్రతినిధి** బిఆర్ఎస్ నాయకులు కిష్టయ్యకు నివాళులు అర్పించిన మెదక్ మాజీ ఎమ్మెల్యే ఏడుపాయల దేవస్థానం మాజీ ధర్మకర్త బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కిష్టయ్య గుండెపోటుతో సోమవారం మరణించడం చాలా బాధాకరమని మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. పాపన్నపేట మండల పరిధిలోని పాత లింగాయిపల్లి గ్రామానికి చెందిన ఏడుపాయల దేవస్థానం మాజీ ధర్మకర్త బిఆర్ఎస్ నాయకులు కిష్టయ్య భౌతిక కాయనికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మెదక్ మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి, జిల్లా నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి,మండల నాయకులు, ఈ సందర్భంగా కిష్టయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. కిష్టయ్య భార్య రాణిని ఓదార్చి మనో ధైర్యాన్ని చెప్పారు. కిష్టయ్య మృతి చెందడం బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు,పార్టీ మంచి నాయకున్ని కోల్పోయింది అన్నారు.వీరితోపాటు పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి,మాజీ రైతుబంధు జిల్లా అధ్యక్షులు సోములు,ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలా గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు జగన్,మండల నాయకులు, మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.ఈ సందర్బంగా మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ లు మరియు నాయకులు కలసి రూ. 1,50,000/ మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి రూ. 50,000/ రూపాయలు కిష్టయ్య కుటుంబానికి అందజేశారు....





# వినతి పత్రానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి పల్లె రజితకు ప్రత్యేకంగా ధన్యవాదాలు

**సిద్దిపేట పవర్ చేర్యాల జూలై 1**

సిద్దిపేట జిల్లా చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డి పల్లి గ్రామంలో గత మూడు నెలల కింద రెండవ వార్డ్ లోని బోరు మోటర్ కాలిపోగా గత మూడు నెలల నుంచి ఇబ్బంది పడుతున్న విషయం గర్నపల్లి పాండు కత్తుల భాస్కర్ రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే కత్తుల భాస్కర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి పల్లె రజితకు వినతి పత్రం సమర్పించి వెంటనే మోటర్ రిపేరింగ్ చేయించి ఒకటో వార్డు, రెండవ వార్డు లోని సుమారు 100 కుటుంబాలకు నీరు లేక ఇబ్బంది పడుతున్నారని వెంటనే రిపేరింగ్ చేయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి పల్లె రజిత మోటర్ రిపేరింగ్ చేయించి త్రాగునీరు అందించారు. దీనికి ప్రత్యేకంగా ఒకటవ వార్డు, రెండవ వార్డ్ తరపున ప్రత్యేకంగా కత్తుల భాస్కర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఒకటవ వార్డు, రెండవ వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# పేద ప్రజల ఇంటికలను సాకారం చేస్తున్నాం

**సిద్దిపేట పవర్ సిద్దిపేట జూలై 1**

పేద ప్రజల ఇంటి కలను సాకారం చేస్తున్న మన సున్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేట పట్టణంలో 9. 10. 11. 20. 38. 43 వార్డులలో ఇందిరమ్మ ఇల్లులకు సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తో కలిసి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు 9.10.11.20.38.43 వార్డులలో మంజూరు అయిన లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఈరోజు భూమి పూజ చేశాం అని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు లిస్టులో పేరు రానివారు ఆందోళన పడవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం అని అన్నారు. గతంలో డబుల్ ఇల్లు ఇస్తామని చెప్పి కెసిఆర్ మాయమాటలు చెప్పి కాలయాపన చేశారు అని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో ఆయన కుటుంబం సంక్షేమం తప్ప ప్రజల సంక్షేమం పట్టించుకోలేదు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకం పెంచుకున్నారు అని అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారు అని అన్నారు. అప్పుల రాష్ట్రంగా తెలంగాణను కెసిఆర్ మార్చారని కానీ ఆ అప్పులను చెల్లిస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి అన్ని వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు కులగణన చేసి దేశానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదర్శంగా నిలిచారు అని అన్నారు. కల్వకుంట్ల కుటుంబం ఎక్కడ జైలుకు పోతుందో ఎక్కడ తమ భవిష్యత్తు నాశనం అవుతుందో అని బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేలు ఆందోళన మొదలై దాడులకు పాల్పడుతున్నారు అని అన్నారు. ఇలాంటి దాడులకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదని ప్రజలు కూడా బిఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మవద్దు అని అన్నారు. ఎంత కష్టమైనా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మల యాదగిరి ముద్దంలక్ష్మి రియాజుద్దీన్ కలిముద్దీన్ పయ్యావు ఎల్లం యాదవ్ మధు నజ్జు హర్షద్ వహాబ్ రజిని సంతోష సాయి ప్రతాప్ రాకేష్ రాజు షాబుద్దీన్ మెరుగు రాజు తదితరులు పాల్గొన్నారు.



# పేద ప్రజల ఇంటికలను సాకారం చేస్తున్నాం

- ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- డబుల్ ఇల్లు ఇస్తామని కెసిఆర్ ప్రజలను మోసం చేశారు
- బిసి కులగణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిన సీఎం
- ఇందిరమ్మ ఇల్లు రానివారు ఆందోళన పడొద్దు
- అరులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం
- పట్టణంలోని 9.10.11.20.38.43 వార్డులలో ఇందిరమ్మ ఇల్లులకు భూమి పూజ చేసిన
- సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

**సిద్దిపేట పవర్ సిద్దిపేట జూలై 1**

పేద ప్రజల ఇంటి కలను సాకారం చేస్తున్న మన సున్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేట పట్టణంలో 9. 10. 11. 20. 38. 43 వార్డులలో ఇందిరమ్మ ఇల్లులకు సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తో కలిసి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు 9.10.11.20.38.43 వార్డులలో మంజూరు అయిన లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఈరోజు భూమి పూజ చేశాం అని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు లిస్టులో పేరు రానివారు ఆందోళన పడవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం అని అన్నారు. గతంలో డబుల్ ఇల్లు ఇస్తామని చెప్పి కెసిఆర్ మాయమాటలు చెప్పి కాలయాపన చేశారు అని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో ఆయన కుటుంబం సంక్షేమం తప్ప ప్రజల సంక్షేమం పట్టించుకోలేదు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకం పెంచుకున్నారు అని అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారు అని అన్నారు. అప్పుల రాష్ట్రంగా తెలంగాణను కెసిఆర్ మార్చారని కానీ ఆ అప్పులను చెల్లిస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి అన్ని వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు కులగణన చేసి దేశానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదర్శంగా నిలిచారు అని అన్నారు. కల్వకుంట్ల కుటుంబం ఎక్కడ జైలుకు పోతుందో ఎక్కడ తమ భవిష్యత్తు నాశనం అవుతుందో అని బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేలు ఆందోళన మొదలై దాడులకు పాల్పడుతున్నారు అని అన్నారు. ఇలాంటి దాడులకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదని ప్రజలు కూడా బిఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మవద్దు అని అన్నారు. ఎంత కష్టమైనా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మల యాదగిరి ముద్దంలక్ష్మి రియాజుద్దీన్ కలిముద్దీన్ పయ్యావు ఎల్లం యాదవ్ మధు నజ్జు హర్షద్ వహాబ్ రజిని సంతోష సాయి ప్రతాప్ రాకేష్ రాజు షాబుద్దీన్ మెరుగు రాజు తదితరులు పాల్గొన్నారు.